ఆమెపై అఘాయిత్యాలు..!

◆ శిక్షల అమల్లోనూ జాప్యమే ◆ బాధితులకు అందని పరిహారం

పాదయాత్రలో పాల్గొన్న రైతుసంఘం నాయకులు

రైతు కష్టాన్ని తెలిపేందుకే పాదయాత్ర

◆ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి

◆ మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేయాలి

◆ రైతు పక్షాన పోరాటం ఆగదు..

◆ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్

◆ ఉరవకొండలో రైతుసంఘం పాదయాత్ర ప్రారంభం

◆ మద్దతుగా తరలొచ్చిన రైతులు, కూలీలు

ప్రజాశక్తి-ఉరవకొండ

'పండించిన పంటలకు గిట్టుబాటు ధరల లేక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. అప్పుల ఊబిలో అన్నదాతలు కూరుకుపోయారు. రైతాంగం పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ రైతు కష్టాన్ని తెలియజేసేందుకు పాదయాత్రను చేపట్టాం'. అని ఏపి రైతుసంఘం నాయకులు పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన పంటలను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ప్రారంభం అయ్యింది. అనంతపురం జిల్లా ఉరవకొండ మండల కేంద్రంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్ అధ్యక్షతన చేపట్టిన పాదయాత్రను రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి రామిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అంబేద్కర్ సర్కిల్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. మొదటిరోజు పాదయాత్ర ఉరవకొండ నుంచి ప్రారంభమై చిన్నముష్టురు, కోనాపురం గ్రామాల మీదుగా పెన్నఅహోబిలం వరకు కొనసాగింది. ఆయా గ్రామాల్లో పాదయాత్ర వెళ్లిన సందర్భంలో రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. పంట నష్టం, మద్దతు ధర లేకపోవడం తదితర అంశాలను పాదయాత్ర బృందం సభ్యుల వద్ద ఏకరువు పెట్టారు. తమ కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకునేలా చూడాలంటూ నాయకులకు విన్నవించారు. పాదయాత్రకు కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపి పాల్గొన్నారు.

రైతుల జీవితాలతో ప్రభుత్వాల చెలగాటం
రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. పాదయాత్ర ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్, రబీ సీజన్లో రైతులు సాగుచేసిన మిరప, పత్తి, సీడ్ జొన్న, పప్పుశనగ తదితర పంటలకు సంబంధించి ఏ పంటకూ రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించలేదన్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటల చేతికందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం విచారకరం అన్నారు. రైతులు సాగు చేసిన అన్ని పంటలకూ గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం, ఇన్సూరెన్స్ విడుదల చేయాలన్నారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. గత మూడు సంవత్సరాలకు ముందు మిరప క్వింటా రూ.60 నుంచి రూ.లక్ష వరకు పలికిన ధర ప్రస్తుతం రూ.20 వేలలోపే ఉండడంతో రైతులు తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోయారన్నారు. మిర్చి డబ్బి, కడ్డీ రకానికి క్వింటా రూ.50వేలు, సీజెంటా ఇతర రకాల మిరపను రూ.25 వేల వద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ.10వేలతో కొనుగోలు చేయాలన్నారు. పత్తికి సంబంధించి ప్రభుత్వం రూ.7250 ధరతో కొనుగోలు చేస్తామని ప్రకటించినా ప్రభుత్వ నిబంధనలతో పత్తి రైతులు అమ్ముకోలేకపోతున్నారన్నారు చెప్పారు. ధలు లేక పెద్దవడుగూరు, యాడికి, పామిడి, తాడిపత్రి ప్రాంతాలలో పెద్ద ఎత్తున రైతులు పత్తిని నిలువ చేసుకున్నట్లు గుర్తు చేశారు. వీటిన్నింటినీ ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. విడపనకల్లు మండల పరిధిలోని హావలిగి, పాల్తూర్ తదితర గ్రామాల్లో సీడ్‌జొన్నను కొంతమంది వ్యాపారస్తులు కుమ్మక్కై, ఒక్క సారిగా ధరను తగ్గించేశారన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయ శాఖ మార్కెటింగ్ శాఖ ద్వారా పంట కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. మిరప పత్తి పప్పుశనగ తదితర పంటలను పండించిన కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక శాఖ మంత్రి స్పందించాలి
వి.రాంభూపాల్

'ఉరకొండ ప్రాంతంలో మిరప, పప్పుశనగ రైతులు గిట్టుబాటు ధరల లేక నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు.. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రైతుల సమస్యలపై స్పందించాలి. ప్రభుత్వంతో మాట్లాడి రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలి'. అని వి.రాంభూపాల్ తెలియజేశారు. పాదయాత్ర సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ ప్రాంతంలో ఎక్కువ శాతం మిరపతో పాటు, పప్పుశనగ పంటలను రైతులు సాగు చేశారన్నారు. 2024-25కు సంబంధించి ఉరవకొండ నియోజకవర్గంలో 11 మంది వ్యాపారులు రైతుల వద్ద పంటలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఐపి పెట్టారన్నారు. రైతులను మోసం చేసిన ఇలాంటి నకిలీ వ్యాపారులపై క్రమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు రైతాంగ సంక్షేమం కోసం అనేక వాగ్దానాలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం సరికాదన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు సైతం రైతుల కోసం మాట్లాడకుండా రాజకీయ వ్యాఖ్యలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారం కోల్పోయాక మరోలా మాట్లాడుతుండడం శోచనీయం అన్నారు. సాగు చేసిన పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రభుత్వాలు స్పందించేంత వరకు రైతుల పక్షాన రైతుసంఘం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ పాదయాత్రలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సిఐటియు నాయకులు వి.రామిరెడ్డి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, ఉపాధ్యక్షుడు విరుపాక్షి, రాజారామిరెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, నాయకులు పెద్ద ముష్టురు వెంకటేశులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఎందులోనూ తక్కువ కాదు... అన్నింటా పురుషులతో సమానమేనని ఎన్ని మాటలు వల్లేవేసినా ఆచరణలో కనిపించడం లేదు. ఆమెపై అణచివేత, అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒంటరిగా బయటేకాదు.. కుటుంబంలోనూ సురక్షితంగా ఉండలేని దయనీయ స్థితి నెలకొంది. బాధితులుగా మారిన వారికీ ప్రభుత్వ పరంగా అందుతున్న సహాయమూ, తోడ్పాటు నామమాత్రంగానే ఉందన్న విమర్శలూ ఉన్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పరిధిలో మహిళలపై ఏటా హింస పెరుగుతూనే ఉంది. ఏటా నమోదవుతున్న నేర గణాంకాలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఏటా మహిళలపై హింస సగటున ఎనిమిది శాతముంటోంది. 2022లో మహిళల పట్ల నమోదయిన కేసులు 248 కాగా, 2023లో అవి 730కు చేరాయి. 2024లో మరో ఎనిమిది శాతం కేసులు పెరిగాయి. జిల్లా మొత్తంగా నమోదవుతున్న నేరగణాంకాల్లో అత్యధికంగా మహిళలపై హింసకు సంబంధించనవే అధికంగా ఉంటున్నాయి.

బాధితులకు న్యాయమేది

మహిళలపై ఏదైనా అఘాయిత్యం జరిగితే మూడు వారాల్లో శిక్ష పడే విధంగా చేస్తామని 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు దిశా చట్టాన్ని తెచ్చారు. ఆచరణలో అవేవీ అమలు జరగలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం వంద రోజుల్లోపు నిందితులకు శిక్ష ఖరారు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని హోంమంత్రి అనిత ప్రకటించారు. ఈ రకంగా ప్రకటనలుంటున్నాయి కానీ ఆచరణే నామమాత్రంగా ఉంటోందన్న విమర్శలున్నాయి. 2020 డిసెంబరు 24న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం సమీపంలో ఒక యువతిని అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ కేసు ఇంకా విచారణ దశలోనే ఉంది. అప్పట్లో పెద్దఎత్తున ఈ అంశంపై ఆందోళనలు జరిగాయి. దీన్ని తాత్కాలికంగా సద్దుమణిచేందుకు కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగమిచ్చారు. కాని నిందితులకు ఇంకా శిక్ష పడలేదు.

కొందరికే పరిహారం

పోక్సో చట్టం కింద కేసు నమోదయినప్పుడు వారికి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు, న్యాయం కోసం పోరాడేందుకు సహకారం అందించే ప్రత్యేక వ్యవస్థ ఉంది. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఈ బాధ్యతలను నిర్వర్తించాలి. కేసు నమోదయినప్పుడే అఘాయిత్య తీవ్రతను బట్టి పరిహారాన్ని రూ.1.50 లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు పరిహారం అందివ్వాలని ఉంది. ప్రాథమికంగా 25 శాతమే మొదట బాధితులకు అందివ్వాలి. ఆ తరువాత పూర్తి ఆర్థిక సహాయాన్ని అందివ్వాల్సి ఉంటుంది. జిల్లాలో కేసులు నమోదయినప్పటికీ ఈ రకమైన ఆర్థిక సహకారం, తోడ్పాటు అందిన వారి సంఖ్య నామమాత్రంగానే ఉండటం గమనార్హం.

డంపింగ్ యార్డు సమస్యపై అసెంబ్లీలో చర్చ హర్షణీయం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో ఏళ్ల తరబడి ఉన్న డంపింగ్ యార్డు సమస్యపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అసెంబ్లీలో చర్చించడం హర్షణీయని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. డంపింగ్ యార్డును తరలించాలని సిపిఎం ఆధ్వర్యంలో గతంలో అనేక ఆందోళనలతో పాటు ఫిబ్రవరి 27, 28వ తేదీల్లో పాదయాత్ర చేసినట్లు తెలిపారు. ఈ పాదయాత్రకు ప్రజలతోపాటు వివిధ పార్టీల నుంచి అశేష స్పందన లభించిందన్నారు. ఈఏపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ డంపింగ్ యార్డు సమస్యపై స్పందించి అసెంబ్లీలో చర్చించడం సంతోషకరమన్నారు. డంపింగ్ యార్డుతో ఇప్పటికే పరిసర కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మార్చాలని కోరారు.

నవ చైతన్యంతో ముందుకు నడుద్దాం

మహిళలను గౌరవించి వారి ఉన్నతికి దోహదపడాలి - అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తలు

మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎండ్లూరి ప్రభాకర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో పట్టి పీడిస్తున్న రుగ్మతలను రూపుమాపి నవ చైతన్య సమాజ స్థాపనకు యువత ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐద్వా, ఎస్ఎస్‌బిఎన్ కళాశాల డబ్ల్యూఈసి, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'పిల్లల చదువులు- మానసిక ఒత్తిళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.సరిత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎస్ఎస్‌బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి కె.నిర్మలమ్మ, ప్రముఖ సైకాలజి కౌన్సిలర్ ఎం.లహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ మహిళలను గౌరవించినప్పుడే ఆ సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. కుటుంబంలో మహిళల ఆశయాలు, మనస్థత్వాన్ని తెలుసుకుని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. మహిళలు మంచి అవకాశాలను అందిపుచ్చుకుని శాస్త్రీయంగా, సామాజకంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని, దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. జీవితాన్ని మార్చే గొప్ప సాధనం చదువు అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలతో మెలగాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక పరిజ్ఞానంతో, నైతిక విలువలతో కూడిన విషయపరిజ్ఞానంతో మెలిగి చక్కటి సమాజ నిర్మాణానికి దోహదపడాలన్నారు. సైకాలజిస్ట్ లహరి మాట్లాడుతూ నేటి విద్యార్థులు రేపటి భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. చెడు పరిచయాలు, స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వ్యాపార ప్రచారానికి ఉపయోగించే విధానం సరికాదన్నారు. నాడు ఎందరో మహిళలు హక్కుల కోసం ప్రాణత్యాగం చేశారని, వారిని స్మరించుకోవడం కోసమే మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. భవిష్యత్తులో విద్యార్థినుల అభివృద్ధి, చైతన్యం కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక, ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, నాయకులు అశ్విని, రేష్మా తదితరులు పాల్గొన్నారు.

'అదానీ' సిబ్బంది బరితెగింపు

పరిశీలనకు వెళ్లిన అధికారుల అడ్డగింత - అనుమతుల్లేవ్ వెనక్కు వెళ్లాలంటూ హుకుం

రైతుల పొలాలను పరిశీలించి వారితో మాట్లాడుతున్న భూగర్భ జలాల డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రావు

హైడల్ ప్రాజెక్టులోకి వెళ్లకుండా భూగర్భ జలాల డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రావును అడ్డుకుంటున్న అదానీ సిబ్బంది

ప్రజాశక్తి-తాడిమర్రి

అదానీ యాజమాన్యం బరితెగించింది. ప్రభుత్వ అధికారులను సైతం పరిశీలన చేసేందుకు వీల్లేదంటూ వారి పరిసరాల్లోకి కూడా రాకుండానే అడ్డుకున్నారు. వారి అడ్డగింపుతో అధికారులు కూడా ఏమి చేయాలో తెలియక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిధిలోని దాడి తోట చిల్ల కొండయ్యపల్లి, పెద్దకోట్ల గ్రామ సరిహద్దుల్లో అదాని హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో గత కొద్ది నెలల నుంచి చిల్ల కొండయ్యపల్లి గ్రామంలో దాదాపుగా 120 మంది రైతుల బోరు బావుల్లో నీటి మట్టం తగ్గింది. కొద్దిపాటి నీరుతో పంట పొలాలు కాపాడుకోలేక నూతన బోరు బావులు వేయిస్తున్నప్పటికీ చుక్క నీరు పడని పరిస్థితి నెలకొంది. చిల్లకుండాయపల్లి గ్రామ రైతుల ఆవేదనను తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, తదితరులు గురువారం నాడు గ్రామంలో పర్యటించారు. రైతుల పొలాలను పరిశీలించి వారి సమస్యలను తెలుసుకున్నారు. సిపిఎం నాయకుల పర్యటన నేపథ్యంలో రైతుల కష్టాలు పత్రికల్లోనూ ప్రచురితం అయ్యాయి. దీనిపై స్పందించిన సత్యసాయి జిల్లా భూగర్భ జలాల డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రావు తన సిబ్బందితో శుక్రవారం నాడు చిల్లకొండాయపల్లి గ్రామంలో పర్యటించారు. రైతుల పొలాలను పరిశీలించి వారితో మాట్లాడారు. రైతుల ఇబ్బందులను పూర్తి స్థాయిలో పరిశీలన చేసి కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున రైతులకు తెలిపారు.

ఆదానీ సిబ్బంది అడ్డగింత

రైతుల పొలాల పరిశీలన అనంతరం డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున అదాని హైడల్ ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్లారు. ప్రాజెక్టు ప్రారంభం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అదానీ యాజమాన్యం అధికారి వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రాజెక్టు లోపలికి వెళ్లేందుకు వీల్లేదంటూ వారిని వెనక్కు పంపేశారు. ఆదానీ సిబ్బంది బరితెగింపుతో చేసేది లేక అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

హంద్రీనీవా వెడల్పు చేయకుండా లైనింగ్‌కు టెండర్లా?

లైనింగ్ చేస్తే ఆ తర్వాత వెడల్పు చేయడం అసాధ్యం
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హంద్రీనీవాను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని, పంట కాలువలు తవ్వి ఆయకట్టుకు నీరు ఇవ్వాలని రైతులు కోరుతుంటే లైనింగ్ పనులకు ప్రభుత్వం టెండర్లు పిలవడం సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హంద్రీనీవాను వెడల్పు చేయకుండా అత్యంత వెనకబడిన అనంతపురం, సత్యసాయి జిల్లాలను ఎలా అభివృద్ధి చేస్తారని ఆయన ప్రశ్నించారు. సీమ అభివృద్ధికి సాగునీటి వనరుల అభివృద్ధి కీలకమన్నారు. ప్రస్తుతం వస్తున్న 40 టీఎంసీలు కాకుండా అదనంగా నీరు ఇస్తామని ఎన్నికల ముందు ప్రధాన రాజకీయ పార్టీలు హామీలు ఇస్తూనే ఉన్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులు చేస్తామని టెండర్లు పిలిచారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి 6300 క్యూసెక్కుల కంటే ఎక్కువ నీరు తెస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం ఖరారు చేసిన టెండర్లలో 3850 క్యూసెక్కులకే పరిమితం చేయడం, రెండవ దశ కాలువ లైనింగ్ పనులకు సిద్ధపడడం చూస్తుంటే ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు ఉందన్నారు. లైనింగ్ పనులను రాప్తాడు ఎమ్మెల్యే కూడా వ్యతిరేకిస్తున్నందున మిగిలిన ఎమ్మెల్యేలు కూడా వారి వైఖరి ప్రకటించాలన్నారు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసి ఆయకట్టును స్థిరీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ముఖ్యమంత్రితో సానుకూల నిర్ణయం ప్రకటింప చేయాలన్నారు.

31లోపు ఆస్తి, నీటి పన్నులు చెల్లించాలి

అనంతపురం కార్పొరేషన్ : 2024-2025 రెండవ అర్ధ సంవత్సరం వరకూ చెల్లించాల్సిన ఇంటి, ఖాళీ జాగా, నీటి పన్నులను ఈనెల 31వ తేదీలోగా చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ బాలస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కార్పొరేషన్‌లో సెలవు రోజుల్లో కూడా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పన్నులు కట్టించుకున్నట్లు తెలిపారు. కావున నగర ప్రజలు ఆయా పన్నులను చెల్లించి సహకరించాలని కోరారు.

జెడ్పీలో పలువురికి ఉద్యోగోన్నతి

అనంతపురం రూరల్ : జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం కింద పని చేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కె.రాజేంద్ర ప్రసాద్ - ఎంపిపి అగలి, కె.చంద్రశేఖర్ - ఎంపిపి ఎన్‌పి.కుంటకు నియమించారు. ఈమేరకు జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

అనంతపురం సిటీ : ఐఎఫ్‌బియు పిలుపు మేరకు ఈనెల 24, 25వ తేదీల్లో దేశవ్యాప్త బంద్‌లో భాగంగా శుక్రవారం బ్యాంకర్లు నగరంలోని సాయినగర్ ఎస్‌బిఐ ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు ఖాదరిబాషా, చంద్రమోహన్, చంద్రశేఖర్. రఘురామ్ యదవ్, ఉద్యోగులు మారుతి, నటరాజ్, జయక్రిష్ణ, షాజహాన్, బాబు, రమేష్, మహీంద్రా, గౌస్‌ఖాన్, సూషా, నీలిమ, బాతి, మనీ, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు న్యాయం చేయాలి

ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమాగౌడ్

నిరసన వ్యక్తం చేస్తున్న బీడీ కార్మికులు

ప్రజాశక్తి-తాడిపత్రి

మహిళా బీడీ కార్మికులకు ప్రభుత్వాలు న్యాయం చేయాలని ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ తాడిపత్రి డివిజన్ కన్వీనర్ ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక రమేష్‌రెడ్డి కాలనీ, పాతకోట బంకమడి వీధి, పడమటిగేరిలోని బీడీ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో పురోగతి చెందారని చెప్పుకునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు పోరాడి సాధించుకున్న బీడీ కార్మికుల చట్టం 1966 ను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కి తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఫ్యాక్టరీ కార్మిక చట్టాలను నాశనం చేస్తూ కంపెనీ యాజమాన్యాలకు ఊడిగం చేయిస్తోందన్నారు. తాడిపత్రిలో వేలాదిమంది కార్మికులు బీడీ రోలింగ్ పనిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి బతుకులు మారడం లేదన్నారు. బీడీ కంపెనీ యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటూ వెయ్యి బీడీలకు ఎక్కడా లేని విధంగా కేవలం రూ.200 మాత్రమే ఇస్తున్నారన్నారు. వెంటనే బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూ.300 ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు, ఇల్లు ఇవ్వాలని, లేబర్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్లు నూరి, రహీంబీ, ఆరీఫా, హసీనా, బసిరన్, రమీజా, రమాదేవి, గోవిందమ్మ, హనుమంతురెడ్డి, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ కింద
పంటలను కాపాడండి : సిపిఎం



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హంద్రీనీవా కాలవ కింద వేసిన పంటలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలోని మండలాల్లో హంద్రీనీవా కాలువ కింద వివిధ పంటలను రైతులు వేసుకున్నారన్నారు. ప్రస్తుతం హంద్రీనీవా కాలవ నీళ్లను బంద్ చేయడంతో నియోజకవర్గంలోని వజ్రకరూరు, ఉరవకొండ మండలాల్లో జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, సీడ్ జొన్న పంటలు రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పూత దశలో ఉన్న పంటలకు మరో నెల రోజుల పాటు నీళ్లు ఇస్తే పంట చేతికి వస్తుందన్నారు. ఇలాంటి సమయంలో హంద్రీనీవా కాలవకు నీళ్లు నిలిపివేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. తక్షణం వంటకాలువలకు నెల రోజుల పాటు హంద్రీనీవా నీళ్లు విడుదల చేయాలని కోరారు.

స్త్రీ సాధికారతకు సమానత్వమే పునాది.!

చదువు, అవగాహన, చైతన్యం ప్రధానం - అన్ని రంగాల్లో మహిళల ముందంజ - నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి అనంతపురం

మహిళల సాధికారత సాధనలో సమానత్వం పునాది. ప్రపంచంలోని చాలా దేశాలు స్త్రీ సమానత్వాన్ని అంగీకరించి, దానికి అనుగుణంగా చట్టాలు రూపొందించాయి. వాటిని ఆయా దేశాల రాజ్యాంగాల్లో పొందుపరిచి అమలు చేస్తున్నారు. కాగా పలువురు మహిళలు, మేధావులు తమకు గౌరవం కన్నా ఉనికి ప్రధానమైనదని చెబుతున్నారు. మహిళల మనుగడ కష్టంగా సాగాల్సిన పరిస్థితుల నుంచి స్వేచ్ఛగా అన్ని రంగాల్లో అభివద్ధి సాధించే దిశగా ఉనికి సాగాలని అభిప్రాయపడుతున్నారు. నేటికీ దేశంలో పరువు హత్యలు, ఇంటిపనికి గొడ్డు చాకిరి, భూమిపై హక్కు, పెరుగుతున్న గహహింస వంటి అంశాలు మహిళా సాధికారత అభివద్ధి వంటి మాటలు సాధ్యమేనా అనిపిస్తున్నాయి. మహిళా శక్తిని గుర్తిస్తూ.. వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేలా ప్రోత్సహించేందుకు మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల మనోభావాలతో ప్రజాశక్తి ప్రత్యేక కథనం.

చదువుతో మహిళల జీవితాల్లో వెలుగు

మహిళలకు చదువు జీవితంలో వెలుగులు నింపుతుంది. అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి మహిళా ఈ అంశాలను పరిగణలో తీసుకుని చదువును తప్పనిసరిగా మొదటి ప్రాధాన్యతగా గుర్తించాలి. అదేవిధంగా అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని ఆచరణలో సద్వినియోగం చేసుకుని గొప్ప స్థాయికి ఎరిగి మహిళా సాధికారతకు నాంది పలకాలి.

విశాల ఫెర్రర్, ఉమెన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్, అనంతపురం.

హక్కులను గుర్తించాలి

హక్కులు, సాధికారత, సమానత్వం మహిళలకు పూర్తి స్థాయిలో అందాలి. మహిళల సామాజిక స్థానాన్ని బట్టి సమాజం ప్రగతిని అంచనా వేయొచ్చని ప్రముఖ తత్వవేత్త కారల్ మార్క్స్ అన్నారు. దీనిని స్ఫూర్తిగా మార్గదర్శకంగా ప్రభుత్వాలు తీసుకుని మహిళల ప్రగతికి పెద్దపీట వేయాల్సిన ఆవశ్యకత ఉంది. లింగ సమానత్వం, హింస నిర్మూలన ఆర్థిక సాధికారత రాజకీయ భాగస్వామ్యం ఆరోగ్యం విద్య వంటి విషయాలపై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉంది.

డాక్టర్ ఉన్నతి, ప్రభుత్వ వైద్యురాలు, జిల్లా వైద్యాధికారి కార్యాలయం, అనంతపురం.

మానవతా దృక్పథంకు మారుపేరు..

మహిళలు మానవతా దక్పథంకు మారుపేరు. ఓర్పు అంకితభావం మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి ఆయుధాలుగా ఉన్నాయి. గతం మహిళలు మాదిరి కాదు మగవారికి ఏమి తక్కువ కాదు అని నిరూపించుకుంటున్నారు. మహిళలకు ముందు కంటే ఇప్పుడు ఎక్కువ స్వేచ్ఛ ఉంది.. దీనిని సద్వినియోగం చేసుకుంటూ విజయవం వైపు సాగాలి. ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా ఎవరికి వారు లక్ష్యం వైపు వెళ్లాలి. అప్పుడే సమాజంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఉంటుంది.

పద్మజ, రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్ అనంతపురం.

సమాజ పురోభివృద్ధిలో మహిళ పాత్ర కీలకం

మహిళల శక్తి, పోరాటాలు, వారు సాధించిన విజయాలు మహిళా లోకానికి దిక్సూచిగా అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రతి రంగంలోనూ మహిళ విశ్వమంతా వ్యాపించి తమదైన ముద్ర వేస్తున్నారు. అయినప్పటికీ ఇంకా ఎన్నో సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి ఉంది. లింగ వివక్ష, అసమానత్వం, హింస వంటి సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయి. వీటిని సమాజం నుంచి చెరిపేస్తే దేశ పురోభివృద్ధికి మరింత ముందుకు సాగుతుంది.

సంగా తేజస్విని వాల్మీకి, ఆంధ్రప్రదేశ్ తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి.

అభివృద్ధిని వేగవంతం చేయాలి

'అభివృద్ధిని వేగవంతం చేయాలి!' ఇది ఈ సంవత్సరం మహిళా దినోత్సవ నినాదం. మనం అంగీకరించినా, అంగీకరించకపోయినా ఈరోజున మహిళలు "ఏ రంగంలోనూ మేం తక్కువ కాద"ని నిరూపించుకుంటున్నారు. ఈ వాస్తవాన్ని అంగీకరించలేని మనస్తత్వం వల్లే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బయట భద్రత లేదనే వాతావరణాన్ని కలిగించడం ద్వారా తిరిగి వారిని ఉత్పత్తిలో భాగస్వాములు కాకుండా అడ్డుకోవడానికి ఈ రకమైన ఆటంకాలు వస్తున్నాయి. యువతికి సంబంధించి తల్లిదండ్రులు చదువు గురించి ఆలోచించకుండా పెళ్లిళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదు. ఆడపిల్లల జీవితం భద్రంగా ఉండాలంటే పెళ్లికంటే వారికి చదువు ముఖ్యని గర్తించాలి.

డా॥ఎం.ప్రగతి, ప్రిన్సిపాల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హిందూపురం.

నాణేనికి ఓ వైపు మాత్రమే...

మహిళా సాధికారత అంతర్జాతీయంగా నాణేనికి ఒకవైపు అన్న విధంగా ఉంది. మహిళ సాధికారత నిజంగా క్షేత్రస్థాయిలో అమలు అవ్వాలంటే మహిళలు వారి హక్కులను సాధించుకోవాలి. అప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుంది. సునీత విలియమ్స్ లాంటి వీరవనితలు అంతరిక్షంలో సైతం అడుగులు వేస్తున్నారు. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హక్కులను చట్టాలను తెలుసుకుని లక్ష్యం వైపు అడుగు వేయాలి. మహిళకు గౌరవం ముందుగా ఇంటి నుంచే దక్కాలి. అప్పుడు నిజమైన మహిళా సాధికారతకు వారధిగా కుటుంబ వ్యవస్థ నిలుస్తుంది.

పరిటాల శైలజ, న్యాయవాది, అనంతపురం

అన్ని రంగాల్లో అవకాశాలు

ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు ఉన్నా, తగిన ప్రోత్సాహం క్షేత్రస్థాయిలో అందడం లేదు. ఉనికిని సాధించే దిశలో ఎంతోమంది విఫలయత్నం అవుతున్నారు. సరైన తోడ్పాటు ప్రోత్సాహం గుర్తింపు లభించని పరిస్థితుల కారణంగా ఎంతో మంది మహిళలు వెనుకంజ వేస్తున్నారు. సరైన అవకాశాలు, మార్గాలను అన్వేషిస్తూ లక్ష్యాలను చేరుకునే ఉన్నత ఆశయంతో ప్రతి మహిళా ముందడుగు వేయాలి. అప్పుడే మహిళ సాధికారత సాధనకు పునాదులు బలంగా ఉంటాయి.

పి.సునీత, వ్యాపార రంగం, అనంతపురం.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-శింగనమల

కూలీలతో మాట్లాడుతున్న పీడీ సలీంబాషా

మండల పరిధిలోని పెరవలి గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ద్వామా పీడీ సలీమ్ బాషా శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇందులో భాగంగా కూలీలు చేస్తున్న ఫారంపాండ్ పనులను పరిశీలించి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఉదయాన్నే పనులకు వచ్చి నిర్దేశించిన పనిని పూర్తి చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఫారం పాండ్ల పనులే చేయాలన్నారు. ఎందుకంటే ఇప్పుడు ఫారంపాండ్ల పనులు చేయడం వల్ల వర్షాలు కురిసినప్పుడు నీరు నిల్వ ఉండటంతో పాటు భూమిలోకి నీరు ఇంకే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా అక్కడే ఉన్న రైతుకు ఫారంపాండ్ వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ శ్రీదేవి, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడాలి

ప్రజాశక్తి-తాడిపత్రి

చిన్నారులతో ఎంఇఒలు నాగరాజు, రామగోవిందరెడ్డి కరస్పాండెంట్ కార్తీక్

శాస్త్ర విజ్ఞానంతోపాటు భారతీయతను అలవర్చుకుని భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడాలని శ్రీవాణి విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.గంగాధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టనంలోని సంజీవనగర్ 3వరోడ్డులో ఉన్న శ్రీవాణి స్మార్ట్ స్కూలులో విజ్ఞాన శాస్త్రం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల మేలవింపుతో ఏర్పాటు చేసిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఇఒలు నాగరాజు, రామ గోవిందరెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా 1 నుంచి 8వ తరగతి వరకూ విద్యార్థులు సుమారు 175 నమూనాలను ప్రదర్శించారు. నమూనాల తయారీలో విద్యార్థుల నైపుణ్యాన్ని గంగాధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.కార్తిక్, ప్రిన్సిపాళ్ల బాలస్వామి, రవికుమార్, ఇస్మాయిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డి.లక్ష్మీదేవమ్మకు జాతీయస్థాయి అవార్డు

అవార్డు అందుకుంటున్న లక్ష్మీదేవమ్మ

గుత్తి : పట్టణానికి చెందిన మాజీ ఎంపిటిసి సీనియర్ నాయకురాలు డి.లక్ష్మీదేవమ్మకు జాతీయస్థాయి అవార్డు దక్కింది. డి.లక్ష్మీదేవమ్మ గతంలో ఎంపిటిసిగా ప్రజలకు అనేక సేవలు చేశారు. వడ్డెర్ల సంఘం నాయకురాలుగా సంఘం అభివృద్ధికి పాటుపడుతున్నారు. దీంతో ఆమె సేవలను గుర్తించి జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాన్ ఇండియా సోషియో కల్చరల్ సంస్థ ఓడ్ కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ సంస్థ తరపున డి.లక్ష్మీదేవమ్మను జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. దీంతో హైదరాబాదులో జరిగిన ఓ కార్యక్రమంలో సినీనటులు సుమన్, దివ్యవాణి కలిసి ఆమెకు అవార్డు అందజేశారు.

విలువలతో కూడిన విద్యనందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-అనంతపురం

కేవలం మార్కులు, ర్యాంకులే కాకుండా విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యమని సరస్వతి విద్యా మందిరం కార్యదర్శి భూశెట్టి రమణమూర్తి, డైరెక్టర్ విజయ సాయికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం పాఠశాలలో ప్రార్థనా సమయంలో ఆయన మాట్లాడుతూ బాలోత్సవం, ఉమర్ ఆలీషా జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు బహుమతులు అందుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వసుంధరమ్మ, శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యాయులు, సాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

12న విజయవాడలో మహాధర్నా

ప్రజాశక్తి-పామిడి

కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఉపాధి హామీ చట్టంలో పని చేసే కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈలనెల 12వతేదీన విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సాకే నాగరాజు, మండల కార్యదర్శి మల్లేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గజరాంపల్లి, పొగురూరు గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం జిల్లాలోని పేదలకు ఓ వరం అన్నారు. ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అడిగిన కూలీలందరికీ పని కల్పించాలని, పనులు జరిగే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని, పనిముట్లు ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఎపిజిబి కేంద్ర కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

బ్యాంకు అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎపి వ్యవసాయ కార్మికసంఘం, సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని తరిమెలలో ఉన్న ఎపిజిబి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో ఇప్పుడున్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సహకరించి స్థలం ఇవ్వడం వల్ల 2015లో నాలుగు అంతస్తుల అధునాతనమైన కార్యాలయంలో ప్రారంభమైందన్నారు. అలాంటి బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని విలీనం పేరుతో తరలించాలని చూడటం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని, లేనిపక్షంలో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునెప్ప, నల్లప్ప, కేశన్న, మల్లేష్, ఓబులేష్, రామాంజనేయులు, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ న్యాయవాదులకు ఉపకార వేతనం ఇవ్వాలి

ఆల్ ఇండియ లాయర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

జూనియర్ న్యాయవాదులకు రూ.10వేలు ఉపకార వేతనం ఇవ్వాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరమసప్ప, ఎం.సతీష్ కోరారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ రూమ్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలసంఖ్యలో న్యాయవిద్యను పూర్తి చేసుకుని వృత్తిలోకి వస్తున్నారన్నారు. అయితే ఇక్కడ వారు అనేక ఒడిదొడుకులు, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాంటి పేద, మధ్య తరగతి నుంచి వచ్చిన ఎంతోమంది జూనియర్ లాయర్లకు ఉపకార వేతనం ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంతేగాకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జూనియర్ న్యాయవాదులకు రూ.5వేలు సరిపోవు.. తాము అధికారంలోకి వస్తే రూ.10వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి నెలలు గుడుస్తున్నా పట్టించుకోలేదన్నారు. వెంటనే హామీని అమలు చేయాలని, లేనిపక్షంలో జూనియర్ న్యాయవాదులను కలుపుకుని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమలో ఐలు జిల్లా ఉపాధక్షులు ఎం.నాగరాజు, కమిటీ సభ్యులు ఆర్.పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎంపోరియం

విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్నన అతిథులు

బెలుగుప్ప : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, ఎంఇఒ మల్లారెడ్డి, వైద్యాధికారి కార్తీక్‌కుమార్‌రెడ్డి, టిడిపి నాయకులు మల్లికార్జున, పాఠశాల కరస్పాండెంట్ మారెన్న శ్రీ శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సిరిపురం నాగరాజు, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, ఉపాధ్యాయులు సంధ్య, నాగవేణి, రషీదాబేగం, మమత, శిరీషా, సుకన్య, ఎర్రిస్వామి, నిత్యప్రకాష్, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

జన ఔషధ కేంద్రాల్లో తక్కువ ధరకే మందులు



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం రూరల్ : దేశవాప్తంగా ప్రధానమంత్రి తీసుకొచ్చిన జన ఔషధ కేంద్రాల ద్వారా పేదలకు అత్యంత తక్కువ ధరలోనే ఔషధాలను అందుబాటులోకి వస్తామని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం నగరంలోని 2వరోడ్డులో నిర్వహించిన ప్రధానమంత్రి జన ఔషధ దివాస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ పథకం తీసుకొచ్చిందన్నారు. ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఇబి.దేవి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక.. తల్లిదండ్రులకు అప్పగింత..

తల్లికి చిన్నారిని అప్పగిస్తున్న పోలీసులు

పుట్లూరు : తప్పిపోయిన నంద్యాల జిల్లా బేతంచెర్ల మండల బుగ్గానపల్లి గ్రామానికి చెందిన నాగమణి కుమార్తె నాగచరిత అలియాస్ శిరీషను పుట్లూరు పోలీసులు శుక్రవారం బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు. పదేళ్ల బాలిక బేతంచెర్ల నుంచి తప్పిపోయి గత గురువారం పుట్లూరు మండలంలోని మండలంలోని తక్కలపల్లి గ్రామానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మహిళా పోలీసు సరళాదేవి చిన్నారిని విచారించి పోలీస్‌స్టేషన్‌కు చేర్పించింది. పాప తెలిపిన వివరాలు తెలుసుకుని సిఐ సత్యబాబు సూచనల మేరకు తల్లి గజ్జి నాగమణికి చిన్నారిని అప్పగించారు.

వైభవంగా 'అడ్డపల్లకి' ఉత్సవం

ఊరేగిన గవిమఠం పీఠాధిపతులు

ప్రజాశక్తి-ఉరవకొండ



అడ్డపల్లకిలో ఊరేగుతున్న పీఠాధిపతి

ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో ప్రసిద్ధిచెందిన ఉరవకొండలోని గవిమఠం శ్రీస్థిత చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం అడ్డపల్లకి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ముందుగా పట్టణంలోని వెలిగొండ రహదారిలో ఉన్న విడిది మఠంలో పీఠాధిపతికి గవిమఠం సహాయ కమిషనర్ రాణి, ఉప పీఠాధిపతులు, అర్చకులు ప్రత్యేక పాదపూజ చేశారు. అనంతరం పీఠాధిపతి శ్రీచెన్నబసవ రాజేంద్ర స్వామిని పల్లకిలో కూర్చోబెట్టి పురవీధుల గుండా మేళతాలాలు, డప్పులు, సంప్రదాయ నృత్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా కర్నాటక రాష్ట్రానికి చెందిన కళాకారుల అమ్మవారి తాండవాలు, వీరభద్ర వేషధారి నృత్యం పలువురిని ఆకట్టుకుంది. డప్పు వాయిస్తూ కళాకారులు చేసిన నత్యాలు చూపరులను కట్టిపడేసాయి. ఉత్సవంలో గవిమఠం గజలక్ష్మి (ఏనుగు) ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, ఆదోని చౌకి మఠం పీఠాధిపతి కల్యాణి స్వామి, అల్లూరి సిద్ధగంగ మఠం పీఠాధిపతి చెన్నబసవ స్వామి, హిరే మఠం పీఠాధిపతి గురులింగ శివాచార్యులు, హత్తిగూడూరు అమాదేస్వర మఠం పీఠాధిపతి గిరి మల్లేశ్వరస్వామి, ఏజెంట్ రాజన్న గౌడ్, మఠం సిబ్బంది గోపీ, నారాయణస్వామి, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు : మండలంలోని తిమ్మంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం 33/11కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున తిమ్మంపల్లి సబ్‌స్టేషన్‌లోని కూచివారిపల్లి, తిమ్మంపల్లి, ఎస్.కొత్తపల్లి పరిసర గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అండ

పుట్లూరు : ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి తానున్నానంటూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అండగా నిలిచారు. మండలంలోని ఎస్.గూడూరు గ్రామానికి చెందిన ఓ మహిళ కొంతకాలంగా ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతోంది. చికిత్స పొందడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబం తల్లడిల్లిపోయింది. ఈ విషయం మండల తెలుగు యువత అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె మంత్రి నారాలోకేశ్‌తో చర్చించి హైదరాబాదులోని బసవతారకం వైద్యశాలలో వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు. తమకు మంచి చేసిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వన్యప్రాణి సంరక్షణ చట్టంపై అవగాహన

అనంతపురం : ఆత్మకూరు మండలంలోని పంపనూరు నగరవనంలో జిల్లాలోని అటవీ శాఖ అధికారులకు అటవీశాఖ చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా జిల్లా అటవీ శాఖ అధికారి విగ్నేష్ అప్పావూ పలు విషయాలపై కూలంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఒలు శ్రీనివాసులు, మధుబాబు, ఫీల్డ్ స్టాఫ్, మినిస్టీరియల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మొద్దు



యల్లనూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు వివిధ కార్పొరేషన్ రుణాల విషయంలో లబ్ధిదారులు దళారీల మాట విని మోసపోవద్దని తహశీల్దార్ రాజా సూచించారు. శుక్రవారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు వివిధ కార్పొరేషన్ రుణాలు, ఇల్లు మంజూరు చేయిస్తామని కొంతమంది లబ్ధిదారులను మోసం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సంక్షేమ పథకాలు ఇచ్చేది ప్రభుత్వమేగానీ, దళారులు కాదన్నారు. అర్హత కలిగిన వారికి మాత్రమే పథకాలు వర్తియన్నారు. కావున ప్రజలు దళారీల మాటలు విని మోసపోవద్దన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

హంద్రీనీవా వెడల్పుతోనే 'సీమ'కు ప్రయోజనం

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి ఎక్కువశాతం నీరు తీసుకొస్తే రాయలసీమకు చాలా ప్రయోజనం చేకూరుతుందని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ అంటేనే కరువుకు నిలయం అన్నారు. ఇక్కడ వలసలు.. రైతుల ఆత్మహత్యలూ ఎక్కువ అన్నారు. అలాంటి రాయలసీమ సస్యశ్యామలం కావాలన్నా, బాగు పడాలన్నా నీరు చాలా అవసరమన్నారు. కావున హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి రాయలసీమకు కృష్ణాజలాలు తీసుకొస్తే భూములన్నీ సస్యశ్యామలం అవుతాయన్నారు. మరోవైపు గోదావరి జలాలను బెనకచెర్లకు తీసుకొచ్చి పోతిరెడ్డి ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చెబుతున్నారన్నారు. ఈ నిర్ణయం సంతోషమే అయినా బెనకచెర్ల నుంచి డైరెక్ట్‌గా అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీళ్లు రావన్నారు. రాయలసీమలోని అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీళ్లు తీసుకెళ్లాలంటే ఏకైక మార్గం హంద్రీనీవా మాత్రమే అన్నారు. కావున హంద్రీనీవాను వెడల్పు చేసి ఎక్కువ శాతం రాయలసీమకు నీటిని తీసుకురావాలని కోరారు.

మహిళా న్యాయవాదుల జాతీయ కాన్ఫరెన్స్‌కు రమ్య

అనంతపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఢిల్లీలో జరగనున్న మహిళా న్యాయవాదుల ఆల్ ఇండియా కాన్ఫరెన్స్‌కు రాయలసీమ నుంచి మహిళా న్యాయవాది వి.రమ్య ఎంపికయ్యారు. న్యూఢిల్లీ చెత్తర్పూర్‌లోని మార్కండేయ హాల్లో 75 సంవత్సరాల భారత రాజ్యాంగం పునరుద్ధీవన భారత్ కోసం మహిళా న్యాయవాదుల పాత్ర అనే విషయంపై ఢిల్లీ హైకోర్టు జడ్జి హెచ్ఎంఐ స్వర్ణకాంత శర్మ, విజయ్ కిషోర్ రహత్కర్ ముఖ్యఅతిథిగా వక్తగా హాజరుకానున్నారు. ఇలాంటి కాన్ఫరెన్స్‌కు రమ్య హాజరవ్వటంపై జిల్లా మహిళా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చేంజ్ ఫర్ సొసైటీ కార్యదర్శులకు పురస్కారం

రాయదుర్గం : రాయదుర్గం ప్రాంతానికి చెందిన చేంజ్ ఫర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శులకు మహిళ ధాత్రి పురస్కారం లభించింది. ఈమేరకు మహిళా దినోత్సవం సందర్భంగా కడప జిల్లా పోరుమామిళ్ల ఓబుళాపురంలో ఉన్న స్వామి వివేకానంద సేవాశ్రమంలో సొసైటీ సంస్థ కార్యదర్శులు భారతి, రోజాకు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పెద్దలు రామకృష్ణారెడ్డి, కస్తూరిబా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయలు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మహిళా స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

రోమన్ టెక్నాలజీ విద్యార్థులతో జెఎన్‌టియు విసి ఇష్టాగోష్టి

అనంతపురం : జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు శుక్రవారం బెంగళూరు రోమన్ టెక్నాలజీ విద్యార్థులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసి మాట్లాడుతూ రోమన్ టెక్నాలజీ వారు అందిస్తున్న అధునాతన టెక్నాలజీ, పరిశోధన ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.సత్యనారాయణ, కెమికల్ ఆచార్యులు దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ మృతదేహం లభ్యం

బెలుగుప్ప : మండల పరిధిలోని రామసాగరం సమీపంలో జీడిపల్లి రిజర్వాయర్‌లో శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ అశ్రాఫ్ అలీ, ఎస్ఐ శివ పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి శవాన్ని బయటకు తీశారు. మృతురాలు సుమారు 50 నుంచి 60ఏళ్ల మధ్య ఉండి రెండు చేతులపై ముగ్గుల బొమ్మలు కలిగిన పచ్చబోట్లు, ఎర్రటి జాకెట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహం ఉబ్బి ఉందని, ఎవరైనా గుర్తిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కర్నాటక మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం : అనంతపురం రూరల్ మండలం కక్కల్లపల్లి బిజెపి కొట్టాల ఆర్చ్ వద్ద శుక్రవారం దాడి చేసి ఆటోలో కర్నాటక మద్యం అమ్ముతుండగా ఇద్దరిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్స్‌పెక్టర్లు సత్యనారాయణ, జయనాథ్‌రెడ్డి తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకుద ఆడి చేసి 732 కర్ణాటక రాష్ట్రం చెందిన 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కక్కలపల్లికి చెందిన షేక్ అస్లాంబాషా, అనంతపురానికి చెందిన వెంకటేష్, కూడేరు చెందిన కృష్ణమూర్తి, ఆత్మకూరు మండలం సనపకు చెందిన హరీష్, అనంతపురం రూరల్ మండలం చెందిన సందీప్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే బజాజ్ ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు రాజేంద్రప్రసాద్, కృష్ణారెడ్డి, జయ నరసింహ, జాకీర్‌హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్ మురళి, కానిస్టేబుల్ భీమేష్, నాగలింగ, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో 20ఏళ్ల జైలు

అనంతపురం క్రైం : మైనర్ బాలిక పై అత్యాచారం చేసిన (పోక్సో) కేసులో వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండాకు చెందిన రమావత్ ఢాక్యానాయక్‌కు 20ఏళ్లజైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ గౌరవ అనంతపురం ఫోక్సో కోర్టు జడ్జి శ్రీమతి రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు వెలువరించారు. బాధితురాలకు రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. 2019 వ సంవత్సరం మే 17న ఓ మైనర్ బాలికను ఢాక్యానాయక్ బలవంతంగా పొలంలోని చింత చెట్టు వద్దకు ఎత్తుకెళ్లాడు. అతని పంచెతో కాళ్లు చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారం చేశాడనే బాధితురాలి తల్లి ఫిర్యాది మేరకు అప్పటి వజ్రకరూరు ఎస్ఐ ఇబ్రహీం కేసు నమోదు చేశాడు. అప్పటి గుంతకల్లు ఎస్‌డిపిఒ ఖాసీంసాబ్ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి స్పెషల్ సెషన్స్ జడ్జ్ ఫార్ పోక్సో ట్రైల్ కేసెస్ కోర్టు అనంతపురం కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసును పూర్తిస్థాయిలో అన్నికోణాల్లో విచారించిన జడ్జి రాజ్యలక్ష్మి నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష, రూ 2 వేలు జరిమాన విధించడంతో పాటు బాధితురాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

ఆర్డీటీ గృహాలను ప్రారంభిస్తున్న స్పెయిన్ దేశస్తులు

ఆర్డీటీ గృహాలు ప్రారంభం

శింగనమల : మండల పరిధిలోని లోలూరు గ్రామంలో ఆర్‌డిటి సహకారంతో నూతనంగా నిర్మించిన 20 గృహాలను స్పెయిన్ దేశస్తులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆర్డీటీ సహకారంతో అన్ని మౌలిక వసతులతో కూడిన గృహాలను నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ సుధాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు అమర్నాథ్‌రెడ్డి, వన్నూరుస్వామి, కృష్ణారెడ్డి, రీజినల్ ఇంజనీర్ జ్యోతి, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ టూర్‌కు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

అనంతపురం : ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాస్త్ర విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం ఇండస్ట్రియల్ టూర్‌కు వెళ్లారు. ఇందులో భాగంగా హిందూపురంలోని వివిధ పరిశ్రమలతోపాటు కియా పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా కార్ల తయారీ, విడిభాగాల తయారీ, కార్ల ఎగుమతి వంటి అంశాల గురించి అవగాహన కల్పించారు. తర్వాత చరిత్రక ప్రదేశమైన లేపాక్షిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి శ్రీరాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

అనంతపురం : భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారానే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు సూచించారు. శుక్రవారం కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూకాలానికి అనుగుణంగా సమాజంలో వస్తున్న మార్పులకు దీటుగా తమ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణులు అశ్వర్థరెడ్డి భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను ఎలా వృద్ధి చేసుకోవాలనే అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి సుధాకర్, అధ్యాపకులు పద్మావతి , నాగభూషణం విద్యార్థులు పాల్గొన్నారు

యూనివర్సిటీ ఆటల పోటీలకు 'అనంత' మెడికోలు

అనంతపురం : విజయవాడలోని పిన్నమనేని సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీలో ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకూ జరగనున్న ఎన్టీఆర్ యూనివర్సిటీ అంతర మెడికల్ కళాశాలల ఆటల పోటీలకు అనంతపురం మెడికల్ కళాశాల మెడికల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈమేరకు శుక్రవారం స్థానిక మెడికల్ కళాశాలలో ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమన్నారు. అన్నింటినీ సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ హేమలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహానాయక్, తదితరులు పాల్గొన్నారు.

మెడికోలను అభినందిస్తున్న మాణిక్యరావు

జెడ్పీలో కేక్ కోస్తున్న ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మహిళలు

మెడికల్ కళాశాలలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

ఎస్వీ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న వక్తలు

మహిళలను గౌరవించాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

సృష్టికి మూలం అయిన మహిళలను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అనంతపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని మెడికల్ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ అని, అమ్మకు ఉన్నంత ఓపిక ఈ ప్రపంచంలో ఏఒక్కరికీ ఉండదని, ఎలాంటి కష్టాలు వచ్చినా ఎదుర్కొని పోరాడే తత్వాన్ని మన అమ్మ దగ్గరనుంచి మనం నేర్చుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించడంతోపాటు సంస్కారవంతంగా మెలగాలనసూచించారు. అనంతరం సీనియర్ మహిళా డాక్టర్లు షారోన్ సోనియా, బెనెడిక్ట్ కోయిల్, హేమలత, సంధ్య, సరళ, భవాని, మంజుల, తదితరులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ కుమారి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుమన గోపీచంద్, డాక్టర్ నిహారిక, డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ శైలజ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎస్వీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన హస్తకళ కృతులను తిలకించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్‌వివి ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ ఏ.శ్రీనాథ్, మహిళా సాధికారత విభాగం కో ఆర్డినేటర్ ఎస్.నజ్మాబేగం, అధ్యాపకులు ఎన్.లావణ్య, పవనకుమారి, ఎస్.రిజ్వానాబేగం, లక్ష్మి రంగమ్మ, నాగలక్ష్మి, దివ్య, భవ్య, జాహ్నవి, ఎం.రిజ్వానా, ఆశాజ్యోతి, ప్రీతి, నాగ ప్రతిమ, మలిహా, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో సంపూర్ణ సాధికారత సాధించాలని ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జీవి సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురం జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ జాతీయ సేవా పథకము భాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సంచాలకులు జీవీ సుబ్బారెడ్డి, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి స్వరూపరాణి, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.లహరి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ : జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా ఇనర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో ఉన్న మౌర్య పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగేంద్రప్రసాద్, మౌర్య స్కూల్ అధినేత లక్కినేని ఆంజనేయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాడికి : స్టార్ ప్యారడైజ్ హైస్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాల్య వివాహాలు, మహిళల ప్రాధాన్యతపై పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఆర్‌డి శశికళను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ నాగేంద్ర, రంగ, ఇలాహా, ఉపాధ్యాయినులు తహరున్, జ్ఞానేశ్వరి, సుమాంజలి, కృష్ణవేణి, అమరావతి, కుమారి, రూప, ఉమాదేవి, అరుణ, అమృత, సుజిత్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయి చైతన్య స్కూల్, నారాయణ హైస్కూల్, సాయితేజ స్కూల్, జూనియర్ కళాశాల మైదానం నుంచి అశోక్ పిల్లర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం చౌడేశ్వరి, విజయభాస్కర్, నల్లపరెడ్డి, సాయి చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహ, నారాయణ హైస్కూల్ ప్రిన్సిపల్, అమర్నాథ్, పిఇటి శివప్రసాద్, దాదా ఖలందర్, సాయితేజ స్కూల్ పిఇటి అబ్రహం, ఆర్‌డిటి సిఒ ఆంజనేయులు క్రికెట్ కోచ్ భార్గవ్ పాల్గొన్నారు.

గుత్తి : స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణంలోని జంగాల కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఆయేషా అంజుమ్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మొదటి సంవత్సర విభాగాధిపతి డాక్టర్ హరిప్రియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శాంతి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్‌సిసి క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామ్‌మూర్తి, ఎన్‌సిసి సిటిఒ కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, నాగప్ప, అధ్యాపకులు, ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ 'ఫ్రైడే డ్రైడే' పాటించాలి

రాయదుర్గం : ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించి ఇళ్లతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రాయదుర్గం సబ్ డివిజన్ మలేరియా యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని చౌడేశ్వరీదేవి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల సమీపంలో కాలనీవాసులకు ఫ్రైడే ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఇళ్లలోని నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు గంగమ్మ, నళిని, శోభ, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, యశోద, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం పోలీసులకు విధుల్లో సడలింపు ఇవ్వాలని వినతి

అనంతపురం సిటీ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం పోలీసులు, సిబ్బందికి ప్రత్యేక సడలింపు ఇవ్వాలని ప్రభుత్వ డివిఎంసి సభ్యులు ఎంఎండి ఇమామ్ కోరారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ఎస్పీ పి.జగదీష్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఇమామ్ మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉంటూ ముస్లిం పోలీసులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. కావున ఈ మాసంలో సెహరీ, ఇఫ్తార్, తరావీహ్ నమాజ్ ప్రార్థనల్లో పాల్గొనేందుకు ముస్లిం పోలీసులకు అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించారు.

ఆర్థికసాయం

యాడికి : రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న మండల పరిధిలోని చందన గ్రామానికి చెందిన ఓ దినపత్రిక జర్నలిస్టు శ్రీనివాసులుకు రాయల్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పసుపులేటి శ్రీనివాసులు శుక్రవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈమేరకు సంబంధిత మొత్తాన్ని తోటి జర్నలిస్టులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు బలయ్య శ్రేష్ఠి, ఉపాధ్యాయులు నవీన్, చంద్రశేఖర్, రవికుమార్, విశ్వనాథ్, పాత్రికేయులు సొరెడ్డి రామచంద్రారెడ్డి, మహమ్మద్ ఫరూక్, మూలింటి శివప్రసాద్ పాల్గొన్నారు

మాజీ సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

ప్రజాశక్తి-గుత్తి

మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైసిపి పట్టణ,మండల అధ్యక్షులు కె.మధుసూదన్ రెడ్డి, జి.గంగరాజు యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ పట్టణ అధ్యక్షులు కె.మధుసూదన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ వైసిపి ప్రభుత్వం హయాంలోనే సంక్షేమ పథకాలు కొనసాగాయని అని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ప్రస్తుతం ప్రజలు అన్నీ గ్రహిస్తున్నారని చెప్పారు. తమ పార్టీ అధినేత వైయస్ జగన్ పై జనసేన నాయకుడు వాసగిరి మణికంఠ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు డి.హుస్సేన్ పీరా, జి.గోవర్ధన్ రెడ్డి, మల్లయ్య యాదవ్, ఎం.రంగస్వామి, సివి.రంగారెడ్డి, జీపు రమణ, వైపి.బాబు, అంజి, జేపీ గాదిలింగ, దేవేంద్ర, పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవాపథకం, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి సంయుక్తంగా శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి సర్వజన ఆసుపత్రి రక్తనిధి వారు అభినందన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి, జాతీయ సేవాపథకం కార్యక్రమ అధికారి జి.మమత, ఎన్ఎస్ఎస్ స్కీమ్ ప్రోగ్రాం అధికారి జి.మమత, తదితరులు పాల్గొన్నారు.

10న అప్రెంటిషిప్ మేళా

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటిఐలో ఈనెల 10వ తేదీ సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులను అప్రెంటిషిప్ కోసం ఎంపిక చేసుకుంటారు. ఐటిఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.